
సాక్షి
బాపట్ల
7
ఆదివారం । 30 । మార్చి । 2025



కోదండరాముడిగా నృసింహుడు

మంగళగిరి టౌన్: శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాల్లో భాగంగా శనివారం కోదండరాముడుగా దర్శనమిచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 521.70 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 5,088 క్యూసెక్కులు విడుదలవుతోంది.



నేటి నుంచి నవరాత్రోత్సవాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో ఆదివారం నుంచి వసంత నవరాత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (ఆది)
బాపట్ల	6.25
నరసరావుపేట	6.27
గుంటూరు	6.25

న్యూస్‌రీల్

పంచాంగం ఆవిష్కరణ



రేపల్లె రూరల్: రేపల్లె డివిజన్ అర్చక సేవా సంఘం ఆధ్వర్యాన స్థానిక కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఉగాది వేడుకల్లో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు. నియోజకవర్గ ప్రజలకు విశ్వావసు నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సేవా సంఘం ఏర్పాటు చేసిన పంచాంగాన్ని ఆవిష్కరించారు. నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ పాడి, పంటలతో సుఖ శాంతులతో వర్ధిల్లాలని కోరారు. కార్యక్రమంలో అర్చక సేవా సంఘంగా రేపల్లె డివిజన్ అధ్యక్షుడు ఎస్‌వైఎల్ఎస్ ఆచార్యులు, కార్యదర్శి దీవి రాజగోపాల్, సభ్యులు చావలి సురేష్, వేదగిరి యోగానంద్, వేదగిరి శ్రావణ్ కుమార్, నందివెలుగు వాసు, రవి, దీవి పావని, భరద్వాజా, కొమ్మూరి సత్యనారాయణ (సత్యం) తదితరులు పాల్గొన్నారు.

'వడలి'ని వరించిన ఉగాది సాహితీ పురస్కారం



చీరాల అర్బన్: చీరాలకు చెందిన రచయిత, సాహితీవేత్త, సహజసాహితి వ్యవస్థాపక అధ్యక్షులు వడలి రాధాకృష్ణను ఉగాది పర్వదినాన రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రతిష్ఠాత్మక సాహితీ పురస్కారం వరించింది. ఈ మేరకు ప్రభుత్వ అధికారులు సమాచారం అందించినట్లు వడలి రాధాకృష్ణ శనివారం తెలిపారు. గత మూడున్నర దశాబ్దాల కాలంగా తెలుగు సాహిత్య, సాంస్కృతిక రంగాలలో చేసిన కృషికి గుర్తింపు లభించిందని అన్నారు. ఉగాది రోజున విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదగా పురస్కారాన్ని అందుకోనున్నారు. ఆయనకు పలువురు ప్రముఖులు, కవులు, రచయితలు అభినందనలు తెలిపారు.

సీతారాముల విగ్రహాలను తాకిన సూర్య కిరణాలు



వేటపాలెం: జాండ్రపేటలోని పురాతన సీతారాముల దేవస్థానంలో ఉగాది పర్వదినం ముందు రోజు సీతారాముల వారి మూలవిరాట్ విగ్రహాలను సూర్య భగవానుడి కిరణాలు శనివారం స్పృశించాయి. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ 120 ఏళ్ల చరిత్ర గలిగిన సీతా రాముల వారి దేవస్థానంలో ప్రతి ఏడాదీ ఉగాది ముందు రోజు సాయం కాలం 5.30 నుంచి 6 గంటల మధ్యన సూర్యకిరణాలు స్వామివారిని తాకుతాయని తెలిపారు. ప్రతి ఏడాదీ ఉగాది ముందు రోజు సూర్యకిరణాలు స్వామి వారి తాకడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. ఇక్కడ ఏర్పాటు చేసిన స్వామి వారికి విగ్రహాలు భద్రాచలంలో సీతారాముల వారి విగ్రహాలను పోలి ఉంటాయని తెలిపారు. అదిక సంఖ్యలో భక్తులు స్వామి వారికి దర్శించు కొన్నారు.

రైలులో 5.50 కిలోల గంజాయి స్వాధీనం

దాచేపల్లి: రైలులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నామని జీఆర్పీ ఎస్ఐ వి.శ్రీనివాసరావునాయక్ తెలిపారు. నడికుడి రైల్వేస్టేషన్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈనెల 28వ తేదీన సహర్లగన్ నుంచి చర్లపల్లి వెళుతున్న ప్రత్యేక రైలులోని ఏ1 ఏసీ కోచ్‌లో గుర్తుతెలియని వ్యక్తులు గంజాయి తరలిస్తున్నట్లు జీఆర్పీ పోలీసులకు సమాచారం అందిందన్నారు. పిడుగురాళ్ల ఆర్పీఎఫ్ పోలీసులతోపాటుగా నడికుడి జీఆర్పీ పోలీసులు ప్రత్యేక రైలుని నడికుడిలో ఆపి తనిఖీలు చేపట్టారని, ఏ1 ఏసీ కోచ్‌లో లైట్ స్కైబ్లూ రంగు ఉన్న బ్యాగ్‌లో 3 ప్యాకెట్లలో 5.50 కేజీల గంజాయి ఉన్నట్లుగా గుర్తించామన్నారు.

కార్డుదారులకు ఈకేవైసీ కష్టాలు

- మొరాయిస్తున్న సర్వర్లు
- రేషన్ డీలర్లు, ఆధార్ సెంటర్ల చుట్టూ పరుగులు
- జిల్లాలో 4.86 లక్షల రేషన్‌కార్డులు
- 12.90 లక్షల మంది లబ్ధిదారులు
- ఇప్పటికీ ఈకేవైసీ చేసింది 11.94 లక్షలు
- నమోదు కానివారు 95,521 మంది
- ఏప్రిల్ 30వరకు గడువు పెంపు



ఈకేవైసీ, ఆధార్ అప్‌డేట్ కోసం బారులు తీరిన లబ్ధిదారులు

బాపట్లటౌన్: పెద్దలకు కూలి పనుల ఒత్తిడి.. పిల్లలకు పరీక్షల టెన్షన్....ఈ నేపథ్యంలో ఈకేవైసీ చేయించుకోవాలంటూ ప్రభుత్వ ఆదేశం. లేకుంటే రేషన్ రాదేమో అనే ఆందోళన. దీంతో రేషన్ దుకాణాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అక్కడేమో సర్వర్లు పనిచేయడం లేదు. ఆధార్ సెంటర్లకు వెళ్లి అప్‌డేట్ చేయించుకునే పనిలో నిమగ్నమయ్యారు. అక్కడ ఐదేళ్లలోపు పిల్లలు, వృద్ధుల వేలిముద్రలు పడడం లేదు. ఏం చేయాలో పాలుపోక కార్డుదారులు ఆందోళన చెందుతున్నారు. అయితే ప్రభుత్వం ఈ ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్ (ఈకేవైసీ) నమోదు గడువును ఏప్రిల్ 30 పొడిగించింది. దీంతో కొంత మేర ఊరట లభించింది.

భయపెడుతున్న సర్వేలు

కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేద ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. పలు రకాల సర్వేలు చేపట్టింది. వికలాంగుల సర్టిఫికెట్ల పరిశీలన చేసి పింఛన్ల తొలగింపునకు రంగం సిద్ధం చేసింది. పి–4 సర్వే పేరిట ఇంటింటికి తిరుగుతున్నారు. రేషన్‌కార్డుదారులకు ఈకేవైసీ చేయించాలని మెలిక పెట్టారు. దీంతో మున్ముందు ఎలాంటి పథకాలు అందకుండా పోతాయోమోనని లబ్ధిదారులు కలవరపడుతున్నారు.

వలసదారుల్లో ఆందోళన

ఉపాధి, విద్య, ఉద్యోగం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు ఈకేవైసీ విషయమై ఆందోళన చెందుతున్నారు. ఏ గ్రామంలో రేషన్ కార్డు ఉందో ఆ గ్రామానికి వచ్చి ఈకేవైసీ చేయించుకోవాలని అధికారులు ఆదేశిస్తున్నారు. సుదూర ప్రాంతాల్లో ఉన్నవారు ఎలా వస్తారని కుటుంబ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు ఈకేవైసీ పూర్తిచేయాలని డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లపై అధికారులు తీవ్ర ఒత్తిడి తీసుకువస్తున్నారు. దీంతో ఎక్కడ రేషన్ కట్ అవుతుందోనని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లా సమాచారం ఇలా..

నియోజకవర్గం	లబ్ధిదారులు	ఈకేవైసీ పూర్తి	పెండింగ్
బాపట్ల	1,85,350	1,72,161	13,189
చీరాల	1,93,152	1,76,909	16,224
వేమూరు	1,99,036	1,85,547	13,489
పర్చూరు	2,38,298	2,20,399	17,899
అద్దంకి	2,53,045	2,34,697	18,348
రేపల్లె	2,21,323	2,06,930	14,420
మొత్తం	12,90,164	11,94,643	95,521

చాలా ఇబ్బందిగా ఉంది



మా కుటుంబంలో నలుగురు సభ్యులు ఉన్నాం. మా బాబు ఈకేవైసీ పెండింగ్ అని వచ్చింది. రేషన్ డీలర్ వద్దకు వెళ్లి వేలిముద్రలు వేయాలని చెప్పారు. రేషన్ డీలర్ వద్దకు వెళ్లాను. అక్కడ వేలిముద్రలు పడలేదు. ఆధార్‌కార్డు అప్‌డేట్ చేయించుకొని రామన్నారు. కర్లపాలెం ఆధార్ సెంటర్‌కు వెళితే సర్వర్లు పనిచేయటం లేదు. బాపట్ల వెళ్లాను. ఉదయం వెళితే సాయంత్రం రమ్మన్నారు. సర్వర్ బిజీగా ఉండటంతో పనికాలేదు. రెండో రోజు బాబును తీసుకొని వెళ్లాను. అయినా పని కాలేదు. ఎండల్లో ప్రయాణం చేయడం ఇబ్బంది ఉంది.

– కొండమూడి సుసన్న, కర్లపాలెం

10 కిలోమీటర్ల ప్రయాణం



మాది కర్లపాలెం. గ్రామంలో సర్వర్లు పని చేయటం లేదు. సుమారు 10 కిలోమీటర్లు ప్రయాణం చేసి బాపట్లకు రావాల్సి వస్తుంది. ఎండలు మండిపోతున్నాయి. చిన్నపిల్లలను ఎండలో తీసుకురావాలంటే ఇబ్బందిగా ఉంటుంది. మా గ్రామంలోనే ఆధార్ అప్‌డేట్ చేసే విధంగా ఏర్పాట్లు చేస్తే బాగుంటుంది.

– కె.విజేత, కర్లపాలెం

జిల్లాలో 93 శాతం పూర్తి

బాపట్ల జిల్లాలో ఈకేవైసీ 93శాతం పూర్తయ్యింది. మొత్తం 4,86,000 రేషన్ కార్డులు ఉన్నాయి. వాటిల్లో 12,90,164 మంది లబ్ధిదారులు ఉన్నారు. వారిలో 11,94,643 మందికి ఇప్పటివరకు ఈకేవైసీ చేయించడం జరిగింది. ఇంకా జిల్లాలో 95,521 మంది పెండింగ్‌లో ఉన్నారు. ప్రభుత్వం గడువు పెంచింది. ఈలోగా పూర్తిచేస్తాం.

– విలియమ్స్, జిల్లా పౌరసరఫరాశాఖాధికారి

పచ్చపార్టీ బరితెగింపు

పోలీసుల ఏకపక్ష ధోరణిని ప్రశ్నిస్తున్న ప్రజలు



చిమటవారిపాలెంలో జాతీయజెండా స్థానంలో పార్టీజెండా ఆవిష్కరించిన దృశ్యం



యద్దనపూడి స్టేషన్ వద్ద ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

యద్దనపూడి: జాతీయజెండా దిమ్మెపై టీడీపీ జెండా ఆవిష్కరణ చేసిన విషయమై యద్దనపూడి మండలం చిమటవారిపాలెంలో జరిగిన వివాదం మండలంలో చర్చనీయాంశమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.... చిమటవారిపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జాతీయజెండా ఆవిష్కరణ కోసం పదేళ్ల కిందట శాశ్వత ప్రాతిపదికన జెండా దిమ్మెను ఏర్పాటు చేశారు. స్వాతంత్య్ర దినోత్సవం, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఇక్కడ నుండే జాతీయజెండాను ఆవిష్కరించటం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో అధికార పార్టీకి చెందిన నాయకులు జాతీయజెండాకు సంబంధించిన స్తంభంపై టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా టీడీపీ జెండాను ఆవిష్కరించేందుకు తెలుగు తమ్ముళ్లు ఆ పార్టీ రంగు వేసేందుకు ప్రయత్నించారు. విషయం తెలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు జాతీయజెండాకు సంబంధించిన స్తంభంపై రాజకీయపార్టీ జెండాను ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించటంతో వివాదం ప్రారంభమైంది. వివాదంలో భాగంగా టీడీపీ నాయకులు ఇచ్చిన సమాచారం నేపథ్యంలో యద్దనపూడి ఎస్సై రత్నకుమారి, పర్చూరు ఎస్సై మల్యాద్రి తన సిబ్బందితో కలిసి ఘటనాస్థలికి చేరుకున్నారు. పరిస్థితిని సమీక్షించి దిద్దుబాటు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు జాతీయజెండాకు సంబంధించిన స్తంభానికి దగ్గరుండి పచ్చపార్టీ రంగులు వేయించటం గ్రామస్తుల విమర్శలకు కారణమైంది. జాతీయజెండాకు ప్రత్యామ్నాయంగా అధికారులు దగ్గరుండి మరో ఇనుపకడ్డీకి జాతీయజెండాకు సంబంధించిన రంగులు వేయించి తాత్కాలికంగా భూమిలో నాటించారు. శనివారం ఉదయం 8.30 గంటల సమయంలో యద్దనపూడి, పర్చూరు ఎస్సైలు తన సిబ్బందితో కలిసి జాతీయజెండాకు సంబంధించిన దిమ్మెపై టీడీపీ నాయకులచే ఏర్పాటుచేసిన తెలుగుదేశం జెండాను దగ్గరుండి ఆవిష్కరింపజేసి తమ స్వామిభక్తిని చాటుకున్నారు. ఈ విషయమై అధికారుల తీరుపై పలువురు గ్రామస్తులు విమర్శలు చేశారు. అనంతరం ఎస్సై రత్నకుమారి ఇరుపార్టీలకు చెందిన ముఖ్యులను 10 గంటలకల్లా స్టేషన్‌కు రావాల్సిందిగా చెప్పి వెళ్లిపోయారు. ఎస్సై రత్నకుమారి ఆదేశాలను పాటిస్తూ వైఎస్సార్‌సీపీకి చెందిన నాయకులు ఉదయం 10 గంటలకల్లా స్టేషన్‌కు చేరుకోగా టీడీపీకి చెందిన నాయకులు మాత్రం వెళ్లకపోవటం గమనార్హం. మధ్యాహ్నం వరకు పరిస్థితిని గమనించిన విలేకరులు ఎస్సై రత్నకుమారిని ప్రతిపక్ష పార్టీకి చెందిన వారిని స్టేషన్‌లో కూర్చోపెట్టారు అధికారపార్టీకి చెందిన వారిని ఎందుకు పిలవలేదు అని ప్రశ్నించగా వారిని శాంతిభద్రతల దృష్ట్యా మార్టూరు స్టేషన్‌లో ఉన్నారని చెప్పటం గమనార్హం. ఈ విషయమై మార్టూరు స్టేషన్‌లో ఆరా తీయగా టీడీపీ నాయకులు అక్కడకు హాజరుకాలేదని సమాచారం. ఎట్టకేలకు మధ్యాహ్నం 2 గంటల సమయంలో వైఎస్సార్‌సీపీ నాయకులను ఇంటికి వెళ్లి సాయంత్రం 5 గంటలకు మార్టూరు స్టేషన్‌కు రావాలని ఆదేశించారు. ఈ విషయమై ఎస్సై రత్నకుమారిని వివరణ కోరగా రెండు పార్టీలకు చెందిన ముఖ్యులకు గత సంవత్సరం అక్టోబర్ నెలలోనే బైండోవర్ చేయటం జరిగిందని, బైండోవర్ కాలపరిమితి మరో నెల వరకు ఉందని శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఇరుపక్షాలను కౌన్సెలింగ్ నిమిత్తం మాత్రమే మార్టూరు సీఐ శేషగిరిరావు వద్దకు తీసుకువెళ్తున్నట్లు తెలిపారు.

సూర్యలంకలో ఇద్దరు వ్యక్తులు గల్లంతు



గల్లంతైన వ్యక్తులను కాపాడిన మెరైన్ పోలీసులు

బాపట్లటౌన్: సముద్ర స్నానాలు చేస్తూ గల్లంతైన యువకులను మెరైన్ పోలీసులు కాపాడిన ఘటన శనివారం సూర్యలంక తీరంలో చోటుచేసుకుంది. నల్గొండ జిల్లా దేవరకొండకు చెందిన 120 మంది ముత్యాలమ్మ తిరునాళ్లను పురస్కరించుకొని సూర్యలంక సముద్ర తీరానికి వచ్చి స్నానాలు ఆచరిస్తున్నారు. సాయంత్రం సుమారు 4:15 గంటల సమయంలో ఒక్కసారిగా వచ్చిన అలల తాకిడికి 45 సంవత్సరాలు వయస్సుగల ఖేతవత్ చిన్నా, 35 సంవత్సరాలు వయస్సు గల నుల్వావత్ శ్రీను అలల తాకిడికి కొట్టుకుపోతున్నారు. పోలీస్ వాచ్‌టవర్‌పై విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది వెంటనే గమనించి హుటాహుటీనా సముద్రంలో దిగి కొట్టుకుపోతున్న వ్యక్తులను కాపాడారు. తక్షణమే స్పందించి యాత్రికుల ప్రాణాలు కాపాడిన సూర్యలంక మెరైన్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ శ్రీనివాసరావు, కానిస్టేబుల్స్ నాగార్జున, అవుట్ పోస్ట్ హెడ్ కానిస్టేబుల్ పోతురాజు, హోంగార్డ్‌లు నరసింహమూర్తి, నాగరాజు, వెంకట నారాయణ, గజ ఈతగాళ్లను ఎస్పీ తుషార్‌డూడీ ప్రత్యేకంగా అభినందించారు.

ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే పల్లెనిద్ర



పల్లెనిద్రలో భాగంగా గ్రామస్తుల సమస్యలు తెలుసుకుంటున్న పోలీసులు

బాపట్లటౌన్: ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. శనివారం రాత్రి జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ ప్రజల చెంతకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడంతోపాటు ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలు, రోడ్డు భద్రత నియమాలు, హెల్మెట్, సీట్‌బెల్ట్‌ను ధరించడం వలన కలిగే రక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. బాపట్ల టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న దేవుడు మాన్యంలో బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, సీఐ రాంబాబు, బాపట్ల రూరల్ స్టేషన్ పరిధిలో బర్తిపూడి గ్రామంలో రూరల్ సీఐ శ్రీనివాసరావు, వెదుళ్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వృక్షనగర్‌లో ఎస్ఐ భాగ్యరాజ్‌లు పల్లె నిద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లాలోని ప్రజలకు ఎస్పీ తుషార్ డూడీ విశ్వావసు నామ సంవత్సరం ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

ఎయిమ్స్‌లో ఉద్యోగాలు పేరిట టోకరా

- మోసగాడిపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు
- 11 మంది నుంచి రూ. 11లక్షలు వసూలు



రూరల్ స్టేషన్ వద్ద బాధితులు

మంగళగిరి: నగర పరిధిలోని ఎయిమ్స్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ యువకులకు ఓ మోసగాడు రూ.11లక్షలకు టోకరా వేసిన ఘటన చోటుచేసుకుంది. శనివారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తాడేపల్లి డోలాస్‌నగర్‌కు చెందిన రావూరి నగేష్ ఎయిమ్స్‌కు గ్రావెల్ తోలే టిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. ఇదే ప్రాంతానికి చెందిన గూడూరి ప్రసాద్ అమరావతిలో నివాసముంటూ రిపోర్టర్‌గా చలామణి అవుతున్నాడు. నగేష్, ప్రసాద్‌కు కుటుంబపరంగా పరిచయాలున్నాయి. ఎయిమ్స్‌లో ఉద్యోగాలు ఉన్నాయని, రూ.లక్ష ఇస్తే ఉద్యోగం వస్తుందని ప్రసాద్ నమ్మపలికాడు. దీన్ని నమ్మిన నగేష్ తన ఇంటి చుట్టుపక్కల ఉన్న 10 మంది యువకులతో రూ.10లక్షలు ఇప్పించాడు. కమీషన్ ఇస్తానడంతో నమ్మి కట్టించాడు. నగదు చెల్లించి ఏడాది గడుస్తున్నా ప్రసాద్ నుంచి ఎలాంటి సమాధానం లేదు. అడిగితే తాను రిపోర్టర్‌నని, తనను ఎవరు ఏమీ చేయలేరని, కేసు పెట్టుకున్నా ఏమీ కాదంటూ బెదిరింపులకు దిగాడు. దీంతో నగేష్ బాధితులతో కలిసి శనివారం రూరల్ స్టేషన్‌కు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సహకార సంఘాల కంప్యూటరీకరణ వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి




మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: సహకార సంఘాల కంప్యూటరీకరణ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని సహకార సంఘాల వివరాల కంప్యూటరీకరణలో అధికారుల అలసత్వంపై జిల్లా కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. కంప్యూటరీకరణ ఆలస్యానికి గల కారణాలపై కలెక్టర్ ఆరా తీశారు. గుంటూరు జిల్లా పరిధిలోని 44 సహకార సంఘాలలో 32 సంఘాల వివరాలు కంప్యూటరీకరణ చేసినట్లు అధికారులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. మిగిలిన 12లో 8 వివరాలను వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు వివరించారు. ప్రకాశం జిల్లాలోని 68 సహకార సంఘాలలో 36 కంప్యూటరీకరణ చేసినట్లు, మిగిలిన 32లో 22 సంఘాల వివరాలను రెండు రోజుల్లో పూర్తిచేస్తామని ప్రకాశం జిల్లా సీఈవో వివరించారు. గుంటూరు జిల్లాలో 4, ప్రకాశం జిల్లాలో 6 సంఘాల వివరాలు కంప్యూటరీకరణలో వచ్చే సమస్యలను పరిష్కరించాలని పై అధికారులకు తెలియజేశామని చెప్పారు. మిగిలిన వాటికి పరిష్కార మార్గం తెలిపిన వెంటనే మొత్తం వివరాలను కంప్యూటరీకరణ చేసేందుకు చర్యలు తీసుకుంటామని ప్రకాశం, గుంటూరు జిల్లాల సీఈవోలు కలెక్టర్‌కు తెలిపారు. వివరాలను కంప్యూటరీకరణ చేసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్, జిల్లా కో–ఆపరేటివ్ అధికారి సీహెచ్ శాంసన్, జిల్లా కో–ఆపరేటివ్ ఆడిట్ అధికారి కె.యలమందరావు, గుంటూరు, ప్రకాశం జిల్లా సీఈవోలు తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ఉగాది ఉత్సవాలు

జిల్లాలో శ్రీ విశ్వావసు నామ తెలుగు సంవత్సర ఉగాది ఉత్సవాలను ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఏపీహెచ్ఆర్‌డీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. పండుగ రోజు తెలుగుదనం ఉట్టిపడేలా ఆడిటోరియంను తీర్చిదిద్దాలని జిల్లా ఉద్యాన శాఖ, ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు సూచించారు. పంచాంగ శ్రవణానికి సంబంధించి పురోహితులను, పూజకు అవసరమైన వస్తు సామాగ్రిని సమకూర్చుకోవాలని, షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడి, తదితర అల్పాహార ఏర్పాట్లను చేయాలని దేవాదాయ శాఖ అధికారికి, తెలుగుదనం ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి, డీఆర్‌డీఏ పీడీకి సూచించారు. ఉగాది పురస్కారాల గ్రహీతలను ఎంపిక చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి, బీసీ సంక్షేమ శాఖ అధికారి, దేవాదాయ శాఖ, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారులకు సూచించారు. వేడుకలు జరిగే పరిసర ప్రాంతాలలో పారిశుద్ధ్య పనులతోపాటు తాగునీటి సదుపాయం ఏర్పాటు చేయాలని బాపట్ల మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులను ఆహ్వానించాలని బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారికి సూచించారు. అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకొని కార్యక్రమం విజయవంతం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా పర్యాటక శాఖ అధికారికి సూచించారు.

గోవర్ధనుడికి ఉగాది కళారత్న పురస్కారం



కళారత్న అవార్డుకు ఎంపికైన గోవర్ధన్

నగరం: ఆయన కలం నుంచి జాలువారిన రచనల సంఖ్య 112కు చేరింది. దీనిని మెచ్చి మరో పురస్కారం వరించింది. ప్రభుత్వం ఉగాది సందర్భంగా కళారత్న పురస్కారం ప్రదానం చేయనుంది. ఆయనే రేపల్లె నియోజకవర్గం నగరం వాసి బొర్రా గోవర్ధన్. ఆయన తల్లిదండ్రులు బొర్రా అంజమ్మ, సత్యనారాయణ. బౌద్ధ రచనలు 42, సైన్స్ పుస్తకాలు 13, గణిత పుస్తకాలు 23, వ్యవసాయ సంబంధ రచనలు 7, జీవిత చరిత్రలు 10, సామాజిక రచనలు 8, ఇతర రచనలు 9 కలిపి మొత్తం 112 రచనలు చేశారు. భట్టిప్రోలు సింహగోష్ఠి విహార ప్రధాన కార్యదర్శిగా, సమత సాహితి వ్యవస్థాపక అధ్యక్షుడిగా, ఆంధ్రప్రదేశ్ సమతా చైతన్య వేదిక ప్రధాన కార్యదర్శిగా, అంబేడ్కర్ నవ బౌద్ధయాన ప్రచార మహాసంఘం సెక్రటరీ జనరల్‌గా, బుద్ధ భూమి విజ్ఞాన సమితి కార్యదర్శిగా, బుద్ధ భూమి మాస పత్రిక సంపాదకునిగా, ధర్మదీపం ఫౌండేషన్ కార్యదర్శిగా ఆయన వ్యవహరిస్తున్నారు. సైన్స్‌పై అవగాహన కార్యక్రమాలు, నవోదయ, గురుకులాల్లో 500 మందికి పైగా విద్యార్థులను చేర్పించడంలో ఆయన కృషి ఎనలేనిది. సాక్షి దినపత్రికలో సన్నిధి పేజీలో బౌద్ధవాణి, ఎడిట్ పేజీలో జ్యోతిర్మయం శీర్షికల్లో కథలు, సందేశాలు ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి.

అవార్డులు ఎన్నో..

- బౌద్ధ రచనలకు 2022లో నేచర్ ఫౌండేషన్, హైదరాబాద్ వారిచే సామ్రాట్ అశోక చక్ర అవార్డు
- నవ్యాంధ్ర రచయితల సంఘం, విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్ 2022లో అందించిన జాతీయ సాహిత్య సేవా పురస్కారం
- గుంటూరు జాషువా కల్చరల్ సెంటర్ 2023లో అందించిన జాషువా సాహితీ పురస్కారం
- ఏలూరు బహుజన భారత్ ఛారిటీ సర్వీసెస్ ఇండియా 2024లో అందించిన జ్ఞాన బుద్ధ పురస్కారం
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే 2024లో గిడుగు తెలుగు సాహితీ పురస్కారం
- వీటితోపాటు ఎన్నో పురస్కారాలు స్వీకరించారు.

న్యాయసేవా సహాయకులుగా పనిచేయటానికి దరఖాస్తులు

చీరాలరూరల్ : జిల్లా వ్యాప్తంగా అన్ని న్యాయస్థానాల ఆవరణలోని మండల న్యాయ సేవాధికార సంస్థ కమిటీలు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఒంగోలునందు న్యాయసేవా సహాయకులు (పారా లీగల్ వలంటీర్లు)గా స్వచ్ఛందంగా పనిచేయటానికి ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రకాశం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ఎ.భారతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు ఇంటర్మీడియట్ పూర్తిచేసి ఉండాలని, ప్రజలకు న్యాయపరమైన సలహాలతోపాటు వారికి చట్టపరిధిలో న్యాయం చేయాలనే ఆలోచన, విషయ పరిజ్ఞానం ఉండాలని సూచించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు పూర్తి వివరాలతో కూడిన బయోడేటాతో ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన పత్రం, సంబంధిత విద్యార్హతలతో కూడిన పత్రాలతో ఒంగోలులోని జిల్లా న్యాయస్థానం ప్రాంగణంలో గల జిల్లా న్యాయసేవాధికార సంస్థలో ఏప్రిల్ 4వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను స్వయంగాగాని పోస్టుద్వారా గాని అందజేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని అర్హత కలిగిన స్వచ్ఛంద సేవా సంస్థలలో పనిచేసేవారు సామాజిక కార్యకర్తలు, ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పత్రికా విలేకరులు, న్యాయశాస్త్రం అభ్యసించే విద్యార్థులు వినియోగించుకోవాలని వారు సూచించారు. ఎంపికైన న్యాయసేవా సహాయకులకు వారుచేసిన పనికిగాను న్యాయసేవాధికార సంస్థ నిర్ణయించిన గౌరవ వేతనం ఎప్పటికప్పుడు అందించనున్నట్లు తెలిపారు. జీతం, వేతనం ఉండవని పేర్కొన్నారు.

శ్రీ విశ్వావసు.. శుభమస్తు

వసంత మాసం ప్రారంభాన.. లేత చిగురు కొమ్మలపై కుహూ కుహూ అంటూ వినిపించే కోయిలల కమ్మనిగానం.. మామిడి పిందెలు, వేప పువ్వు తదితర షడ్రుచుల కలయికతో తయారయ్యే పచ్చడి నేర్పే జీవిత పాఠం.. రాబోయే ఏడాదిలో జరగబోయే మంచీ, చెడులు, భవిష్యత్తు గురించి చేసే పంచాగ శ్రవణం.. ఇవన్నీ తెలుగువారి ప్రథమ పర్వదినమైన ఉగాది ప్రత్యేకతలు. కొత్త ఆశలు.. కొంగొత్త ఆకాంక్షలతో తెలుగు నూతన ఏడాదికి జిల్లా ప్రజలు స్వాగతం పలికారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం అందరి జీవితాల్లో శుభాలు నింపాలని ఆకాంక్షించారు.

నేడు ఉగాది పర్వదినం

- కొత్త ఆశలతో తెలుగు నూతన సంవత్సరాదికి స్వాగతం
- షడ్రుచుల సంగమం ఉగాది పచ్చడి ప్రత్యేకం
- పంచాంగ శ్రవణం తెలుగువారి ప్రత్యేకత
- శ్రీ విశ్వావసు నామ సంవత్సర వేడుకలకు ఏర్పాట్లు



సత్తెనపల్లి: జిల్లా ప్రజలు సంప్రదాయ పద్ధతుల్లో శ్రీ విశ్వావసునామ సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ ఉగాది వేడుకలు జరుపుకొనేందుకు సిద్ధమయ్యారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు చేశారు. ఉగాది రోజున కొత్త పనులు ప్రారంభించడం, ఉగాది నాడు పంచాంగ పఠనం నిర్వహించడం ఓ ప్రత్యేకత. తెలుగు సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పలు సంస్థలు, దేవస్థానాలు, ప్రముఖులు పండితులతో పంచాంగ పఠనం నిర్వహిస్తారు. జన్మ నక్షత్రం లేదా నామ నక్షత్రం ఆధారంగా వ్యక్తిగత జీవిత అంశాలు, వారి ఆదాయ, వ్యయాలతోపాటు సమాజం, రాష్ట్రం, దేశం పోకడలు, రాజకీయాలు తదితర అంశాలను విశ్లేషిస్తూ పంచాంగ పఠనం చేస్తారు. ఆ సందర్భంగా దాదాపు ప్రతి ఒక్కరూ తమ జాతక ఫలితాలు తెలుసుకోవడానికి ఆసక్తి చూపుతారు. ఉగాది వసంత రుతువు ఆగమనం ప్రారంభమైన రోజు. ఈరోజు షడ్రుచులతో చేసిన పచ్చడి తింటారు. ఇక ఆలయాలు, మాధ్యమాల్లో పండితులు వినిపించే పంచాంగానికి పలువురు ప్రాధాన్యత ఇస్తారు.

కొత్త ఆశలు, ఆశయాలకు పునాది



కాలంలో వచ్చే మార్పులకు ఇది నాంది. మోడు వారిన ప్రకృతి చిగురించే కాలం ఇది. జీవితంలో కొత్త ఆశలకు, ఆశయాలకు పునాది ఈ ఉగాది. ఇది తెలుగువారికి విశేషమైన పండుగ. అందుకే కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వేంకటేశ్వర స్వామికి కూడా ఉగాది ఆస్థానం పేరుతో ఉత్సవం నిర్వహిస్తారు.

– కూనాగు వెంకటేశ్వర్లు, సత్తెనపల్లి

ఉగాది పచ్చడిలో ఆరోగ్య రహస్యం



ఉగాది పచ్చడి రుచులలో ఒక్కో దానికి ఒక అర్థం ఉంది. ఉప్పు మన జీవితంలో ఆనందం, రుచికి సంకేతంగా పరిగణిస్తారు. పులుపు తెలివిగా వ్యవహరించాల్సిన పరిస్థితులను తెలియజేస్తుంది. చేదు బాధను దిగమింగాలని లేదా భరించాలని సూచిస్తుంది. తీపి సంతోషానికి ప్రతీక. కారం సహనం కోల్పోవడానికి సూచిస్తుంది. పచ్చిమామిడి ముక్కల్లో తగిలే వగరు రుచి కొత్త సవాళ్లను ఎదుర్కోవడం గురించి తెలియజేస్తుంది.

– పి.వెంకటలక్ష్మి, సత్తెనపల్లి

పంచాంగ శ్రవణానికి ప్రాధాన్యం



ఉగాది రోజున పంచాంగ శ్రవణానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ ఏడాది వర్షాలు.. ఏ ఏ పంటలు పండే అవకాశం ఉందో తెలుసుకోవచ్చు. ఈరోజు తలంటు స్నానం ఆచరించి నూతన వస్త్రాలు ధరించి ఇష్టదైవాన్ని పూజించాలి. ఆలయాలను దర్శించుకుని ఉగాది పచ్చడి స్వీకరిస్తే మంచి జరుగుతుంది. పంచాంగ శ్రవణం ద్వారా అరిష్టాలు తొలగి శుభదాయకంగా ఉంటుంది. ఉగాది పండుగ రోజే కొత్తదస్త్రాలను రాయడం ప్రారంభించాలి.

–వెలిదండ్ల హనుమత్ స్వామి, పీఠాధిపతి, సత్తెనపల్లి

తెలుగువారికి ప్రధానమైన పండుగ



తెలుగు ప్రజలకు సంవత్సరాది ఉగాది పండగే. రుతువులను అనుసరించి ఈ ఏడాది శ్రీ విశ్వావసు నామ సంవత్సరం. ఉగాది నుంచే తెలుగు సంవత్సరం మొదలవుతుంది కనుక ఇది తెలుగువారి మొదటి పండుగ. ఈరోజు నుంచి వసంత నవరాత్రులు ప్రారంభమవుతాయి. ప్రతీ తెలుగు కుటుంబం ఈ ఉగాది పండుగను విధిగా జరుపుకోవాలి.

–మాదా మల్లికార్జునరావు, అధ్యక్షుడు, అభ్యుదయ విజ్ఞాన సమితి, సత్తెనపల్లి

ఆటో ప్రమాదంలో గాయపడ్డ మరో మహిళా కూలి మృతి



జె.పంగులూరు: ఈ నెల 19వ తేదీన మండలంలోని అలవలపాడు సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన ఆటో ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ కొమ్ము సులోచన (65) శనివారం చికిత్స పొందుతూ మృతిచెందింది. మిర్చి కూలీలను ముప్పవరం నుంచి రావినూతల తీసుకెళుతూ అలవలపాడు సమీపంలోని జాతీయ రహదారిపై సిమెంట్ దిమ్మను ఢీకొని ఆటో బోల్తా పడిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ ప్రమాదంలో కూలీల ముఠా మేస్త్రి షేక్ ఆషిర్‌బి అక్కడిక్కడే మరణించింది. ఆ ప్రమాదంలో గాయపడిన మరో ఐదుగురు కూలీలను హాస్పటల్‌లో చేర్చారు. గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న కొమ్ము సులోచన శనివారం మరణించింది. ఈమె తలకు బలమైన కావటం వలన మరణించింది. గుంటూరులోనే పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని ముప్పవరం తీసుకొచ్చారు. మిగతా నలుగురు కోలుకున్న విషయం తెలిసిందే. సులోచన మృతదేహాన్ని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రావూరి రమేష్‌బాబు, పార్టీ నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు, వలపర్ల భాస్కరావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

పారా లీగల్ వలంటీర్ల పాత్ర కీలకం

గుంటూరు లీగల్: పేదలకు న్యాయ సహాయం అందించడంలో పారా లీగల్ వలంటీర్ల పాత్ర కీలకమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్, చైర్మన్ పి.వి.రాంబాబు పేర్కొన్నారు. క్యాలెండరు యాక్టివిటీస్‌లో భాగంగా జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు శనివారం జిల్లా గుంటూరులో పారా లీగల్ వలంటీర్స్, పర్మినెంట్ లోక్ అదాలత్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్, పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ పి.వి.రాంబాబు మాట్లాడారు. పారా లీగల్ వలంటీర్స్ ప్రాముఖ్యతను వివరించారు. ఏ ఒక్క వ్యక్తీ కూడా సామాజిక, ఆర్థిక అసమానతల కారణంగా న్యాయం పొందకుండా ఉండకూడదన్నారు. సెక్షన్-11 ప్రకారం ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ కావాలంటే వార్షిక ఆదాయం మూడు లక్షల రూపాయలకు మించకుండా ఉండాలని తెలిపారు. లోక్ అదాలత్‌ల ద్వారా పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ చేయవచ్చని తెలిపారు.

● **లక్ష్మీపురం:** ధర్మవరం స్టేషన్‌లో పలు అభివృద్ధి పనుల నేపథ్యంలో రైలు నంబర్ (17215) మచిలీపట్నం–ధర్మవరం రైలు ఈనెల 31వ తేదీ నుంచి ఏప్రిల్ 30 వరకు ధర్మవరం స్టేషన్‌కు బదులు అనంతపూర్ స్టేషన్ వరకే ప్రయాణిస్తుందని డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ శనివారం తెలిపారు.

ఉగాది అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి

బాపట్ల : శ్రీ విశ్వావసు తెలుగు సంవత్సర ఉగాది పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని జిల్లా ప్రజలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర సమాచార పౌర సంబంధాల, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి, జిల్లా ఎస్పీ తుషార్ డూడీలు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది పండుగను ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆనందంగా జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. సకల శుభాలు కలగాలని కోరారు.

● పెట్రోలు బంకు మేనేజర్‌పై దాడిపై కేసు నమోదు

సంతమాగులూరు (అద్దంకి రూరల్): సంతమాగులూరు మండలంలోని పుట్టావారిపాలెం జంక్షన్‌వద్దనున్న పెట్రోలు బంకు మేనేజర్‌పై దాడిచేసిన వారిపై శనివారం సంతమాగులూరు ఎస్సై కేసునమోదు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు .. మండలంలోని పుట్టావారిపాలెం జంక్షన్‌వద్ద నున్న విజయసాయి పెట్రోలు బంకు వద్దకు శుక్రవారం అర్ధరాత్రి మండలంలోని కామేపల్లి గ్రామానికి చెందిన డీ.రామాంజనేయులు మరో ఇద్దరు వ్యక్తులు పెట్రోలు బంకు వద్దకు వచ్చారు. బైకు పార్కింగ్ చేసే విషయంలో పెట్రోలు బంకు మేనేజర్ శ్రీనివాసరావుతో గొడవ పెట్టుకుని రాడ్‌తో దాడి చేశారు. దీంతో గాయాలైన శ్రీనివాసరావును స్థానికులు నరసరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. శనివారం వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు.